

# 10

## తుమ్మేటి రఘోత్తమరెడ్డి

నా కో ఫ్రెండ్ వుండేవాడు. ఇప్పుడూ వున్నాడు. కాని ఇప్పుడు ఫ్రెండా, కాదా అంటే చెప్పలేం.... ఒకప్పుడు... అంటే ముప్ఫయి సంవత్సరాల క్రితం... నేను బొగ్గుగనుల్లో ఉద్యోగంలోకి వచ్చిన కొత్తలో పరిచయం అయిండు. అతని పేరు రియాజ్. అతను సింగరేణి బొగ్గుగనుల్లోనే – నేను పనిచేసే గనిలోనే క్లర్కుగా ఉద్యోగం చేసేవాడు. వయసులో నాకంటే మూడేండ్లు పెద్దవాడు. నాకు అప్పుడు ఇరవై రెండు సంవత్సరాల వయసు. నేనేమో బొగ్గుగనిలో కార్మికుడ్ని. నెత్తిన బొగ్గు తట్ట మోసే కార్మికుడ్ని. అతను గని ఉపరితలంలోని ఆఫీసులో కార్మికుల అటెండెన్స్, వాళ్ళ జీతాలకు సంబంధించిన లెక్కలు రాయడం అట్లాంటి పనులు ఆయనవి.



# స్టేటస్

ఒకరోజు నైట్‌డ్యూటీలో రియాజ్‌కు సెలవు అవసరం పడితే వాళ్ల పై అధికారి ఇవ్వలేదు. కార్మికుల అటెండెన్స్ రిజిష్టర్‌లో వేసుకోగలపాటి చదువు వచ్చిన కార్మికుని కోసం వందలాదిమంది కార్మికుల్లోంచి ఆయన నన్ను ఎంచుకుని, వాళ్ల పైఅధికారికి నన్ను చూపించి, ఇతను నా పని చేస్తాడని ఒప్పించి నన్ను గని ముఖద్వారపు పైన వుండే ఆఫీసు గదిలో కూర్చుండబెట్టి అతను వెళ్లిపోయాడు. అట్లా అపుడపుడు నడిపిస్తూవుండేది వాళ్లు!

అట్లా రియాజ్ నాకు పరిచయం అయిండు. ఆ పరిచయం పరిచయంగానే వుండిపోకుండా అది స్నేహానికి దారితీసింది. అతని పరిచయం కలిగేనాటికి నా స్థితి ఏమిటంటే.... కథలు రాయాలని బాగా ఆలోచిస్తూ వున్నాను. రాయ ప్రయత్నిస్తూ వున్నా సరిగా రాయలేకపోయేవాడ్ని. నాకు సరైన సహాయం గాని, ఆ మనుషులు గాని, అసలు సాహిత్యం గురించి గాని నాకు సరిగా తెలవను కూడా తెలువదు. ఏదో అన్వేషణ! ఏదో వెదకడం అన్నట్టుగా సాగేది నా స్థితి. యద్దనపూడి సులోచనారాణి, కోడూరి కౌసల్యాదేవి, మాదిరెడ్డి సులోచన, తమిరిశ జానకి వంటి వారి నవలలను బాగా చదివేవాడ్ని. ఆ ప్రేమ కథల సాహిత్యమే ప్రధానంగా నాకు తెలుసు. కాని ఆ లిటరేచర్‌తో నాకు తృప్తి కలుగలేదు. నా లోపల ఇంకేదో అసంతృప్తి వుంటూనే వుండేది. ఎందుకో ఎక్కువగా నేనా లిటరేచర్‌తో మమేకత్వం చెందలేకపోయాను. అట్లని ఆ తరహా లిటరేచర్ పట్ల నాకేమీ చిన్నచూపు కలుగలేదు. నా స్థితి నాది–అది మరింత భిన్నం. నేను అనుభవించివచ్చిన వ్యవసాయరంగపు జీవితం ఒక తరహాగా వుంది. ఆ క్రైసిస్ లోంచి వచ్చిన వాడిని నేను. ఇక్కడ బొగ్గుగనుల్లోకి వస్తే, పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగానే వుండేది. ఇది ఇంకో విధమైన జీవితం. దీని కొసా మొదలూ ఏదీ అంతుచిక్కేది కాదు. అందుచేత నేను పుట్టి పెరిగిన గ్రామజీవితం ఒకటి – నేను వచ్చిపడిన ఉద్యోగజీవితం మరోటి. తీరా నేను చదువవలసివస్తున్న కథలూ, నవలలూ మరో రకంగా వుండేది. అంతా గందరగోళంగా వుండేది. కాని ఏది దొరికితే అది చదవడం ఒక వ్యసనంగా కొనసాగించేవాడ్ని. అట్లా ఒక తీవ్రమైన ఒత్తిడి – అన్వేషణలో నేను వున్న రోజుల్లో నాకు రియాజ్ పరిచయమైండు.

అప్పటికి అతని స్థితి ఏమిటి అంటే అతను కరీంనగర్లో డిగ్రీ చదువుకున్నాడు. అందువల్ల అప్పుడు ప్రారంభమవుతున్న సరికొత్త భావజాలం – అంటే సమాజం ఈ విధంగా వుంది, ఇంతగా అంతరాలు పెరిగిపోయాయి, దీన్ని ఈ విధంగా మార్చాలి అనే ఓ 'విప్లవాత్మక' భావజాలం అన్నమాట. ఆ భావజాలం ప్రభావం కొంత ఈ రియాజ్ మీద కూడా వుండేది. ఇతను డిగ్రీ చదివే రోజుల్లో కథలు రాయడానికి ప్రయత్నం చేసి, అచ్చుకాక, విరమించుకున్నవాడు. తరువాత బతుకుతెరువు కోసం బొగ్గుగనుల్లో క్లర్కుగా పనికి కుదిరినవాడు. నాకతను పరిచయం అయ్యేనాటికి అతని బ్యాక్‌గ్రౌండ్ అది!

నేనేమో ఈ జీవితపు ఒత్తిడులను ఎదుర్కొంటూ, వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూనే మరోవైపున కథలు రాయాలనే గట్టి పట్టుదలతో రాయడం ఆరంభించినవాడ్ని నేను. రాసి రాసి అచ్చుపడక రాయడం విరమించుకున్నవాడు అతను. ఇదీ మేం కలుసుకునే నాటికి మా ఇద్దరి పరిస్థితి. దారిలో ఇద్దరు ప్రయాణీకులు ఎదురెదురుగా తారసపడటం వంటిదన్న మాట ఈ కథారచన విషయంలో మా ఇద్దరి పరిస్థితి.

'నన్ను అనేక నా ఉద్రిక్తతల మధ్య అవి బయటి జీవితపువి కూడా అనేకానేక మానసిక దుస్థితుల మధ్య నేను చిక్కుకున్నప్పుడు, నన్ను బాగా దగ్గరకు తీసుకుని, తన ఇంట్లో ఆశ్రయమిచ్చి, నాతో ఓపికగా వ్యవహరించినవాడు రియాజ్. నాకు స్నేహం పంచిన చాలా సహృదయుడతను. చాలా నిరాడం బరుడు. ఏమీ రిజిడ్‌గా వుండేవాడు కాదు. నా అభిప్రాయమే కరెక్టు. నీ అభిప్రాయం శుద్ధ తప్పు అనే రకం కాదు. నా కథలు చదివో లేక సాహిత్య చర్చల్లోనో అతను నిదానంగా తన అభిప్రాయాలను చెప్పేవాడు. అన్నింటికంటే మించింది ఏమిటంటే తను రాయడం విరమించుకుని కూడా, రాయమని నన్ను ప్రోత్సహించిన మనిషి రియాజ్. నువ్వు ఆలోచించడం కరక్టుగానే వుంది. నీ పద్ధతిలో నువ్వు ముందుకు సాగవచ్చు. ఇట్లా రాస్తూ రాస్తూ ముందుకు సాగవచ్చు అని మొట్టమొదటిసారిగా నాకు భరోసా కలిగించిన వ్యక్తి రియాజ్. అది రైటర్స్ తొలిదశలో వున్నవాళ్లకు, రచయితలనే కాదు, కళాకారులకు, మామూలు మనుషులు ఎవరికైనా సరే జీవితంలో ఎపుడో అపుడు తొలిరోజుల్లో అనుభవంలోకి వచ్చేదే అట్లాంటిదేదో అతను నాకు కలిగించాడు. ఆ స్థితిలో వున్నవాళ్లకు అటువంటి భరోసా మాటలు ఎంత ఉత్సాహాన్ని, నమ్మకాన్ని, శక్తినీ కలిగిస్తాయో నాకు రియాజ్ ద్వారా అనుభవంలోకి వచ్చింది.

ఆయన నాకోమారు కాళీపట్నం రామారావుగారు రాసిన 'యజ్ఞం' 'కుట్ర' కథలిచ్చి చదివి చూడమన్నాడు. నాకా కథలు బాగా నచ్చినయ్. ఆ రెండు కథలు ఒకటి వ్యవసాయరంగపు సంక్షోభాన్ని ఉత్తరాంధ్ర రైతు జీవితం ద్వారా విశ్లేషిస్తే, మరోటి పారిశ్రామిక రంగపు మాయలను బట్టబయలు చేసేది. ఆ తరువాత కొడవటిగంటి కుటుంబరావు గా 'సాహిత్య ప్రయోజనం' అన్న వ్యాస సంపుటము ఇచ్చిండు! జీవితానికి, సాహిత్యానికి ఎటువంటి సంబంధం వుంటుందో అట్లా ఉండాలని నేనేదో లోలోపల అనుకుంటూ వస్తున్నానో. ఆ వ్యాసాల్లో కూడా నాకేదో కొంత అర్థమైనట్టు తోచింది. నా వెదుకులాట, నా అన్వేషణ చూసి, నాకు ఉపయోగపడే పుస్తకాలనే అతను ఎంచి తీసి ఇచ్చిండని నాకు అర్థమైంది. సో.... అట్లాగ.... అట్లాంటి పరిచయం మాది. చాలా క్లోజ్‌గా తిరిగేవాళ్లం. సినిమాలు చూసేవాళ్లం. మా కాలరీలోని ఫిల్మ్‌సొసైటీలో బొగ్గు గని కార్మికులకు సభ్యత్వం ఇచ్చేవారు కాదు – ఎందుకంటే, కార్మికులు తాగుబోతులు, ఇవి చాలా గొప్ప సినిమాలు, వీళ్ళకు అంతగా అర్థంకావు అని అనుకునేవాళ్లు. క్లర్కులు, గని అధికారుల్లో కొందరు దాన్ని నడుపుకునేవారు. నాకు రియాజ్ సిఫారసు చేస్తేగాని ఫిల్మ్‌సొసైటీలో వాళ్లు సభ్యత్వం ఇవ్వలేదు. సో.... అట్లా దేశదేశాలు సినిమాలూ, చర్చలూ... కొన్నేండ్లు గడిచాయి. నా కథలూ అచ్చవుతూనే వున్నాయి. అతనూ సంతోషాన్ని వ్యక్తం చేసేవాడు.


మా స్నేహాన్ని చూసి అటు క్లర్కులూ, ఇటు కార్మికులూ మొదట్లో చిత్రంగా చూచేవాళ్లు. వాళ్లకూ,

వీళ్లకూ మధ్య పరిచయాలే వుంటాయి కాని స్నేహాలు వుండవు మరి. కాని మా ఇద్దరిని కలిపింది సాహిత్యం. ఆ సాహిత్యం కూడా ఏమిటీ అంటే ఆయన ఏదైతే తన వల్ల కాదనుకుని విరమించుకున్నాడో అది బహుశా రాయడం అనే కోణంలోంచి నా కథలతో కొంత ఐడెంటిఫై అవడం వల్ల కూడా కావచ్చు. ఇది మా మధ్య స్నేహానికి ప్రాతిపదిక.

అయితే నాలుగైదు సంవత్సరాలు గడవక ముందే అతను తన క్లర్కు ఉద్యోగానికి రిజైన్ చేశాడు. ఎందుకు చేసినావయ్యా రిజైన్ అంటే, ఇక్కడ అంతగా ప్రమోషన్ అవకాశాలు లేవు. రెవెన్యూ డిపార్టుమెంటు లోకి పోతే ప్రమోషన్స్ బాగా వుంటాయి అన్నాడు. వాళ్ల నాన్న గ్రామంలో పోలీస్ పటేల్గా చేసినాడట - సో... ఈయనకు రెవెన్యూ డిపార్టుమెంటులో తహశీల్దార్ కావడం డ్రీమ్ అట! అదీ సంగతి. వాళ్ల నాన్న కోరిక కూడా అదేనన్నాడు. అందుకని ఆ డిపార్టుమెంటులోకి పోదల్చుకున్నానని నాతో అన్నాడు. నేను అది విని అయ్యో! అనుకున్నాను. ఎందుకు పోతావయ్యా? ఇక్కడ స్థిరమైన ఉద్యోగం, క్వార్టర్ సౌకర్యం, రేపు పిల్లలక్కూడా కంపెనీ స్కూళ్లలో విద్య, వైద్యం అన్నీ బాగున్నాయి కదా ఎందుకయ్యా వదులుకునిపోవడం అంటే ఏమో నాకు ఇక్కడ బాగనిపించడం లేదు, పోతున్నాను అని చెప్పి వెళ్లిపోయిండు. అట్లా వెళ్లిపోయిన మనిషి తరువాత కాలంలో కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల మంథని, పెద్దపల్లి వంటి రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లోనూ వాటిలోని కొన్ని మండల కేంద్రాల్లోనూ పని చేసేవాడు. ఇక ఎప్పుడైతే ఊరుమారిండో మామధ్య కలుసుకోవడం తగ్గిపోయింది. ఒకరికొకరు తెలువడం కూడా తగ్గిపోయింది. ఇప్పటిలా ఫోన్స్, సెల్ఫోన్స్ అప్పుడు లేవు. రవాణా సౌకర్యాలూ అంతంతమాత్రమే. నేను ఉత్తరాలు రాసేవాన్ని, అతను ఎప్పుడో ఓమారు రాసేవాడు. మనిషినికలవాలంటే పోయి రావాల్సిందే తప్ప మరేదారీ లేని కాలం. అట్లా ఓ నాలుగు సంవత్సరాలు గడిచివుండవచ్చు.

ఒకనాడు మా కాలరీలో, మెయిన్రోడ్డులో, ఎండలో నేనేదో పనిమీద తొందర తొందరగా సైకిల్ తొక్కుతూ ఏదో అర్జంటు పనిమీద వెలుతుంటే మరో పక్కన అదే దారిన నాకెదురుగా వస్తూ రియాజ్ కనిపించాడు. అంత ఎండలో కూడా నాకు ప్రాణం లేచివచ్చినట్టు అన్పించి పలుకరించాను. ఎప్పుడు వచ్చినవిక్కడికి అంటే, నిన్ననే వచ్చానన్నాడు. వాళ్ళ మేనమామ వుంటాడు ఈ వూళ్లో - అక్కడే వున్నాడట. నాకు ఆశ్చర్యం కలిగింది - నిన్న ఈ ఊళ్లోకి వచ్చిన మనిషి - ఈరోజు దాకా కూడా నా దగ్గరికి రాలేదేమిటి అన్పించింది, నాకు బాధ కలిగింది. ఆమాటే ఆయనతో అంటే, ఆయన ఒక్క క్షణం విచారించి ఓమాట అన్నాడు. నేను చాలాసార్లు ఇక్కడికి వచ్చిపోతూనే వున్నాను. కాని నీ దగ్గరకు రావాలని ఉన్నా రాలేకపోతున్నాను అన్నాడు. ఇదింకా ఆశ్చర్యమూ, బాధా కలిగించాయి. ఆ మాటే అతన్తో అంటే అతనూ నొచ్చుకుంటూనే మరో మాట అన్నాడు.

'ఈ ఊరు వచ్చిన ప్రతీసారి నీ దగ్గరకు రావాలనే వుంటుంది. కాని భయం వేస్తుందీ' అన్నాడు! 'భయమా? ఎందుకు? అన్నాను నేను - ఇది కొత్త విషయం! ఏ రాత్రి - ఎప్పుడు పోలీసులు వస్తారో నీ కోసం మీ ఇంటికి అని భయం వేస్తుంది అన్నాడు. అందుకనే రావడం లేదు. మరే కారణమూ లేదు అన్నాడు. ఇతను ఇట్లా ఆలోచిస్తున్నాడా అని అన్పించింది. నాకేం మాట్లాడాలో తోచలేదు. అతను వెళ్లిపోయాడు. ఇది మా మధ్య కొత్తగా వచ్చిన విషమం. అటువంటి పరిస్థితి అయితే మొదటి నుంచీ ఉండేదే - ఈమధ్య వచ్చిన పరిస్థితి అయితే కాదు - ఆనాడు మా బొగ్గుగనుల్లో పరిస్థితులు చాలా ఉద్రిక్తంగా వుండేవి. గనుల్లో అధ్వాన్నమైనపని పరిస్థితులు, గ్రామాల్లో దొరలను మించిన గని అధికారులు, వాళ్లకు తోడు యూనియన్ నాయకులు, కార్మికుల్లో కోపోద్రిక్తతలు, సమ్మెలు, పోలీసులు ఒక్కోసారి పోలీసు కాల్పులూ, ఆ రోజుల్లో పోలీసులకు విచక్షణ తక్కువ. గనుల ప్రాంతాల్లోనే అని కాదు. అంతకుముందు నుంచే అటువంటి పరిస్థితులు గ్రామాల్లో నెలకొని వుండేవి. పోలీసుల తీరు ఎంతకొచ్చిందంటే వాళ్ల ప్రమోషన్ల కోసం అమాయకులను చంపి 'తీవ్రవాదులనే' దాకా నన్నమాట. అదంతా ఆ చరిత్రంతా అందరికీ తెలుసు కదా. సహజంగానే మాకూ భయంగానే వుండేది. భయపడితే బతుకుబండి సాగదు గనుక భయంలో కూడా ముందుకే సాగేది. నాదే కాదు, అందరిదీను.



ఏ రోజైనా సాయంత్రం మా ఇంట్లో నలుగురం మిత్రులం కూచుని మాట్లాడుకుంటుంటే రాత్రుల్లు ఒకోసారి బాగా పొద్దుపోయేది. కాలరీ వీధుల్లో పోలీసులు కాపలాగా తిరుగుతుండేవారు. అనుమానం వస్తే ఏ ఇల్లైనా సోదా చేసేవారు, ఎవరినైనా పట్టుకుపోయేవారు. అట్లా మేమంతా కూచున్న ఆ రోజుల్లో మాకు ఓ వైపు భయం కూడా కలిగేది. కాని ఇప్పటిదాకానైతే నా ఇంటికి ఎపుడూ పోలీసులు రాలేదు. బహుశా పోలీసుల్లో కూడా రానురాను విచక్షణ బాగా పెరిగివుండాలి. ఎవరి అనుభవాల్లోంచి వాళ్లు మరింత నేర్చుకుని అడ్వాన్స్ అవుతారు కదా! అందువల్ల కావచ్చు.

అట్లా కొంతకాలం గడిచింది. రియాజ్ తండ్రి చనిపోయాడని ఎవరో తరువాత రోజుల్లో వాళ్ల గ్రామపు గని కార్మికుడు నాతో చెబితే పోయి రియాజ్ను పరామర్శించాను. తరువాత కొన్ని సంవత్సరాలకు మా అక్కయ్య చనిపోయింది. రియాజ్కు కూడా తెలిసిన మా అక్కయ్య. అతను రాలేదు తెలిసివుండదేమో అనుకున్నాను. నేనూ చెప్పలేకపోయాను. తరువాత ఎవరో చెప్పారట. పోనీలే వాడికి రాబుద్ధి కాలేదు అనుకున్నాను. నేనెందుకాశించాలి అని నాకు నేను సమాధానం చెప్పుకున్నాను. సంతోషంలో, దుఃఖంలో అయినవాళ్లు కలుసుకుంటారు కదా! సరే పోనీలే అని నన్ను నేనే సముదాయించుకున్నాను. మరెన్నడూ అతనూ, నేనూ కలుసుకోలేదు కానీ తరువాత మరికొద్ది సంవత్సరాలకు కాబోలు, ఓ రోజు ఉదయాన న్యూస్పేపర్లో ఓ వార్త చదివాను, జగిత్యాల రెవెన్యూ డివిజన్లోని ఓ మండలాఫీసులో పనిచేసే ఓ రెవెన్యూ ఇన్స్పెక్టరును ఆయనింట్లోనే అవినీతి నిరోధక శాఖ పోలీసులు రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారని ఆ రెవెన్యూ ఇన్స్పెక్టర్ పేరు రియాజుద్దీన్ అని వున్నది.

**(2009లో వచ్చిన తుమ్మేటి రఘోత్తమరెడ్డి ఏడు మౌళికకథల డివిడిలోంచి)**